



నగరం నడి బొడ్డున నవనాగరికంగా కనిపించే హోటల్ భవనం అది. . .

ఆ భవంతి ఆరో అంతస్తులో, పదహారో నంబరు గది దగ్గిరి కెళ్ళి 'బజ్' నొక్కాను.

తలుపు తీసిన వ్యక్తి ప్రశ్నార్థకంగా చూశాడు నా వైపు.

"పండిట్జీని కలుసుకోవాలి." చెప్పాను.

"పండిట్జీతో మంత్రిగారు మాట్లాడుతున్నారు. వెయిట్ చెయ్యండి." హాల్లో ఉన్న సోఫా చూపిస్తూ అన్నాడతను.

కూర్చున్నాను. . .

ఎయిర్ కండిషన్ చేసిన గది కావటం వల్ల చాలా హాయిగా ఉంది. గదిలో వెలిగించిన మైసూరు అగరు వత్తులు సువాసనలి వెదజల్లుతున్నాయి. లోపలి గదిలోంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి.

మంత్రిగారు కూడా పండిట్జీ చేత జాతకం చూపించుకుంటున్నారు కాబోలు. . .

మంత్రి అయినా, సామాన్యులు మనిషైనా ప్రతి వారికీ సమస్యలు ఉంటూనే ఉంటాయి. కొన్ని అంతరంగానికి సంబంధించినవైతే, మరికొన్ని దైనందిన జీవితానికి సంబంధించేవి. ఇలాంటి పండిట్జీలనూ, బాబాలనూ ఆశ్రయించి, అలాంటి సమస్యల నుంచి తాత్కాలికంగానైనా ఉపశమనం పొందాలని కొందరు ఆరాట పడుతూంటారు.

చిన్నప్పటి నుంచీ నా కసలు జాతకాలు చూపించుకోవటం మీదా, చిలక జోస్యం చెప్పించుకోవటం మీదా నమ్మకం లేదు.

ఒకసారి మా ఇంటికి ఒక కోయ దొర వచ్చాడు. అతగాడికి మా నాన్న గా రెప్పుడో వైద్యం చేశారట. ఆ విశ్వాసంతోనే ఆ ప్రాంతాలకు వచ్చినప్పుడల్లా మా ఇంటికి వచ్చేవాడు. అప్పుడప్పుడూ పుత్తి గోళ్ళూ, జింక చర్మం కూడా తీసుకొచ్చి ఇచ్చేవాడు. అతను చేతిలో రేఖలు చూసి భవిష్యత్తు బాగా చెప్పగలడని అప్పట్లో మా నాన్న అనేవారు. . .

నేను బి. ఎ. పాసయిన తొలి రోజుల్లో ఒకసారి ఆ కోయదొర మా ఇంటికి వస్తే, నా కిష్టం లేకపోయినా, నాన్న బలవంతం మీద చెయ్యి చూపించుకున్నాను. చేతిలో ఉన్న గీతల్ని చూసి

# జలుబులు, ఫ్లూను గూర్చిన ముఖ్య విషయాలు మరియు ఈ వ్యాధులను ఎదుర్కొను విధములు



"జలుబు, ఫ్లూ వల్ల వచ్చే బాధలనుంచి వెంటనే ఉపశమనం ఇవ్వడంలో అనాసిన్ ఎంతో సహాయపడుతుంది" అంటున్నారు నటాలియా తీసోవా.

## ఏటివలన జలుబులు ఫ్లూ వస్తాయి?

జలుబులు, ఫ్లూగల మనుష్యుల నుండి గాలిలో కొనిపోబడు విషపు సీటి (వైరస్) తుంపురుల వలన జలుబులు, ఫ్లూ వస్తాయి. మామూలుగా ఈ వైరస్‌లను ఎదిరించు శక్తి మీ శరీరమునకు ఉన్నది. అయితే, అతి ప్రయాణ లేక పోషణ లోపము వలన మీ శరీరము బలహీనమై, రోగమును అడ్డుకొనే దాని శక్తి తగ్గి పోతుంది.

## వాటి లక్షణాలు ఏమిటి?

తలభారము, తలనొప్పి. కారెడు ముక్కుతో జలుబు ఆరంభిస్తుంది, వణుకుట, బాధ మరియు చెమట పోయుట, సాధారణంగా ఫ్లూతో వస్తాయి. దగ్గు, గొంతునొప్పి, ఒడలంతా నొప్పులు, ఆకలి లేమి మరియు అలుపు కూడ ఉండవచ్చును.

## అది చిక్కులను దారి తీయవచ్చునా?

వెంటనే నివారించకపోతే ఫ్లూ, న్యుమోనియా మరియు శ్వాస మార్గము పైభాగములో, రోగ సంక్రమణకు దారి తీయవచ్చును.

## అనాసిన్ ఎలా సహాయ పడుతుంది?

అనాసిన్ జలుబులు మరియు ఫ్లూ బాధలనుంచి ఉపశమనం కలిగిస్తుంది. అనాసిన్ బలీయమైనది—అది ప్రపంచమంతటా డాక్టర్లు సిఫారసు చేసే బాధా నివారక పదార్థం కలిగి యున్నది. అనాసిన్ లక్షలాది ప్రజలకు విశ్వసనీయమైనది. డాక్టర్లు ఇచ్చే విశ్వసనీయమైన ప్రిస్క్రిప్షన్ లాగా అది మందుల మిశ్రమం. జలుబు, ఫ్లూల యొక్క హెచ్చరిక లక్షణాలు కనిపించగానే, అనాసిన్ కొంచెం నీళ్ళతో రోజులో నాలుగు సార్లు తీసుకోండి.

## మీరు ఇంకా ఏమి చేయాలి?

- మరగబెట్టిన నీరు, నారింజ లేదా బత్తాయి పండు రసం లాంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా త్రాగండి.
- పుష్టికరమైన ఆహారాలను తినండి.
- తగినంత విశ్రాంతి తీసుకోండి.
- అంటిసెప్టిక్ ద్రవముతో లేక ఉప్పు నీళ్ళతో గొంతుకు పుక్కిలి పట్టండి.



శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన
మేనర్స్
అనాసిన్*

భారతదేశపు ఎక్కువ జనప్రియమైన నొప్పినివారిణి
జెఫ్రీ మేనర్స్ వారి అనాసిన్ విభాగం నుంచి

*Regd. TM. A24-6/79


చాలా చెప్పాడు కోయదొర. . . మంచి ఉద్యోగం వస్తుందన్నాడు. ముప్పయ్యారో ఏట ఇల్లు కట్టే యోగం ఉందని పూరించాడు ... ఆపై ఇద్దరు ఆడ పిల్లలూ, ముగ్గురు మగ పిల్లలూ ఖాయమని చెప్పాడు. . .

ఈ సంఘటన జరిగి ఇరవై ఏళ్ళు దాటింది. అతగాడు చెప్పింది ఒక్కటంటే ఒక్కటీ జరగలేదు. 'కలక్టరాఫీసులో కాగితాలు రాసే గుమాస్తా ఉద్యోగం కూడా మంచి ఉద్యోగమే' నని సరిపెట్టుకుంటే ఆ ఉద్యోగమే నాకొచ్చింది. . . ముప్పయ్యారో ఏట ఇల్లు కట్టేమాట అటుంచి, అసలప్పట్లో ఉంటున్న రెండు గదుల అద్దె కొంప లోంచి మరో మంచి వాటాలోకి మారటంకూడా జరగ లేదు. . . పోతే, కోయదొర చెప్పినట్టు ఇద్దరు ఆడపిల్లలు కాదు సరి కదా, ఒక్క ఆడ పిల్లయినా పుట్టనందుకు తీరిక దొరికినప్పుడల్లా మా ఆవిడ దిగులు పడుతూంటుంది . . . ఆ సమయంలో నేను కనక ఎదురుగా ఉంటే అదేదో నా అప్రయోజకత్వం అన్నట్టుగాకూడా ఆడిపోసుకుంటుంది.

ఆ మధ్య ఒకసారి మా ఫ్రెండు నారాయణరావ్ కూడా నా చెయ్యి చూశాడు. . . కావాలని నా అంతట నేను చూపించలేదు. . . 'ముందు మీదుంటే కరెక్ట్ రీడిం గొస్తాయి గురూ' అని తనకు తానే చెప్పుకుని, నా కుడి చేతిని బలవంతంగా లాక్కుని మరీ చూశాడు ఒక 'బార్'లో. . . హెడ్‌లైన్ బాగుందన్నాడు. 'ఆ గీత అలా కాక ఇంకోలా ఉంటే దేశానికి ప్రధాన మంత్రి వయ్యే వాడివి' అన్నాడు. ఉంగరం వేలిమీద ఉన్న పుట్టు మచ్చ అరచేతిలోనే కనక ఉండి ఉంటే ఆరుద్రను మించి పోయే వాడివి' అన్నాడు. అన్నీ అన్న తరవాత ఆర్నెల్లల్లో ఆస్పత్రి యోగం ఉందన్నాడు. . . అతను చెప్పిన ఏ విషయాన్నీకూడా సీరియస్‌గా తీసుకోలేదు నేను.

నారాయణరావ్ బార్‌లో అలా నాకు జాతకం చెప్పి ఇప్పటికి ఏడాది దాటి ఆర్నెల్లయి పోయింది. అప్పటినుంచీ నాకు కనీసం జలుబుకూడా చెయ్యలేదు. కానీ నాకు జాతకం చెప్పిన తొమ్మిదో రోజున టైఫాయిడ్ జ్వరంతో నారాయణరావ్ మాత్రం ఆస్పత్రిలో జాయినయ్యాడు.

ఇలాంటి అనేక కారణాల వల్లనే జాతకాలు చెప్పే వారన్నా, చెప్పించుకునే వాళ్ళన్నా నాలో ఒక రకమైన ఉదాసీనత ఏర్పడి పోయింది. ఎప్పుడైనా నేను బస్సులోగాని, రైల్లోగాని ప్రయాణం చేస్తూ, కాలక్షేపానికి వార పత్రికలు కొనుక్కున్నప్పుడు వాటిని అడిగి తీసుకుని వారఫలాలు చదువుకునే వాళ్ళను చూసి జాలిపడుతూంటాను.

అలాంటిది రెండ్రోజుల క్రితం పేపర్లో ఆ ప్రకటన చూసినప్పటి నుంచీ అరిగి పోయిన గ్రామఫోను రికార్డు పెట్టినట్టు మా ఆవిడ నా చెవిలో పోరు పెట్టేసరికి నేనూ ఆ ప్రకటన చూడక తప్పిందికాదు!.

"దైవజ్ఞ శిఖామణి నగరానికి రాక!" అదీ ప్రకటన.

ఆ ప్రకటన క్రింద ఒక ఫోటో ఉంది. ఆ ఫోటోలో జవహర్‌లాల్ నెహ్రూగారు పండి

ట్జీకి తను అరచేతిని చూపిస్తున్న దృశ్యం ఉంది.

ఒకప్పుడు నెహ్రూగారి చెయ్యి చూసి జాతకం చెప్పి శభాష్ అనిపించుకున్న దైవజ్ఞ శిఖామణి లహర్ పండిట్ ఆనంద భవనంలో పదహారో నంబరు గదిలో బస చేస్తున్నారనీ, పాతిక రూపాయలకు భూత భవిష్యత్ వర్తమానాల గురించి ఉన్నదున్నట్లు చెబుతారనీ ప్రకటనలో రాసి ఉంది.

అది చదివిన తర్వాత నేనూ కొంచెం మెత్తబడిన మాట వాస్తవం! అంతే! మా ఆవిడ పక్కింటి పిన్నిగార్ని అర్జంటుగా పాతిక రూపాయలు అప్పడిగి తీసుకొచ్చి నా చేతిలో పెట్టింది..

పండిట్జీని కలుసుకోవటం నాకు తప్పని సరైంది. . .

అంతలో లోపలి గదిలోంచి మంత్రిగారు బయటకు రావటం వల్ల, నా ఆలోచనలు ఆగిపోయేయి.

అంతకుముందు తలుపు తీసిన వ్యక్తి వచ్చి— "మీరు లోపలకు వెళ్ళచ్చు!" అన్నాడు నన్ను చూసి. నెమ్మదిగా గదిలోకి నడిచేను.

ఎదురుగా కనిపించిన పండిట్జీకి అప్రయత్నంగానే నమస్కారం పెట్టేను. . ఆయనకూడా ప్రతి నమస్కారం చేసి చిరునవ్వుతో ఆహ్వానించేరు.

"మీరు ఈ హోటల్లో ఉంటున్నారని మొన్న పొద్దున్న పేపర్లో ప్రకటన చూసేను!" ఆయన పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంటూ చెప్పేను.

"మీ పేరు. . . ?" నావైపు క్షణం పాటు చూసి. తర్వాత అడిగేడు ఆయన.

చెప్పేను.

ఏదో గ్రహించినట్లు తల పంకించి కళ్ళు మూసుకున్నాడు. ఆ తర్వాత అన్నాడు.

"నాకు జాతకాలంటే నమ్మకం ఉండేది కాదు!"

"నిజమేనండీ! నిన్నమొన్నటి దాకా జాతకాలంటే నా కంతగా నమ్మకం ఉండేది కాదు!"

ఆయన పెదాలతోటే చిన్నగా నవ్వి "ఇన్నేళ్ళుగా లేని నమ్మకం ఇంత హఠాత్తుగా కుదిరిందంటే. మీ రేవో చిక్కుల్లో ఇరుక్కుని ఉండాలి!" అన్నాడు.

ఆయన వూహించింది అబద్ధం కాదు.

ఏ పని తలపెట్టినా ఈ మధ్య ఆటంకాలు ఎదురవుతూ ఉన్నాయి. కుడిచేతిలోకి వచ్చిన డబ్బు ఎడం చేతికి తెలియకుండా మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చైపోతూంది. ఏ పని చేసినా ఫలితం లేకుండా పోతూంది. ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం.. చాలీ చాలని సంపాదన!. . అన్నీ చికాకులే!. . ఇలాంటి గతుకుల బాటలోంచి ఈ బతుకు బండి ఎప్పుడు బయట పడుతుందో తెలుసు కోవాలనే ఆరాటం మా ఆవిడతో బాటు నాలోనూ ఎక్కువైంది.

ఆ విషయమే చూచాయగా చెప్పేను పండిట్జీకి.

అంతా విని ఆయన ఏదో ఆలోచిస్తున్నట్లు శూన్యంలోకి చూశాడు. పొడవైన గడ్డాన్ని చేత్తో దువ్వుకున్నాడు. దృఢమైన శరీరం— కాషాయ వస్త్రాలు. . మెడలోంచి జుబ్బా మీదుగా వ్రేలాడుతున్న రుద్రాక్షలు. దట్టమైన కనుబొమలు. .వాటి క్రింద లోతైన కళ్ళు. . . గిరజాలు తిరిగిపోయిన జుట్టు నల్లగా నిగనిగలాడుతూ, ఆయన కాస్త వయసు లేదనే విషయాన్ని స్పష్టం చేస్తూంది. అలా ఆయనవైపు పరిశీలనగా చూస్తూంటే ఏదో ఆకర్షణ వంటిది కనిపించింది.

"వూ"! ఏదో ఆలోచనవచ్చిన వానిలా మళ్ళీ మరోసారి తల పంకించి, నావైపు తిరిగి, నా అరచేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఒకటి, రెండు రేఖల్ని పరిశీలనగా చూశాడు. ఒక నిమిషం పాటు అలా చూసింతర్వాత.

"నీ చిన్నప్పుడు నువ్వెవరికో ప్రాణ దానం చేసేవ్"! అన్నాడు. అరచేతిలోని రేఖల్ని అడ్డంగానూ, నిలువుగానూ కొలుస్తూ !

వెంటనే నాకు గుర్తు రాలేదు. క్షణం పాటు గతాన్ని వెతుక్కున్నాను. ఆ గతంలో నా చిన్నతనమంతా మనసులో మెదిలింది. ఆ చిన్నతనంలో అనుకోకుండా జరిగిన ఆ సంఘటన కూడా కళ్ళ ముందు కదిలింది.

"అవునండీ! మీ రన్నది నిజమే! ... నే నప్పుడు బి. ఎ. చదువుతూ ఉండేవాడ్ని!" ఉత్సాహంగా చెప్పేను.

నా ఉత్సాహాన్ని ఆయనేం పట్టించుకోలేరు.

"శాస్త్రీ!" పిలిచేడు.

అంతకుముందు నాకు తలుపుతీసిన వ్యక్తి పేరు ఆదే కాబోలు—అతను గదిలోకి వచ్చి నిలబడ్డాడు వినయంగా.

"ఇంకా ఎవరైనా వచ్చేరా?" అడిగేడు శాస్త్రిని

ప్రెస్టీజ్ వల్ల అమితలాభం పొందండి



Prestige

ప్రెస్టీజ్ వల్ల అమితలాభం పొందండి

ప్రెస్టీజ్ ప్రెషర్ కుక్కర్ మీకు జీవితాంతం శ్రమ లేకుండా సేవ చేయడానికే తయారు చేయబడింది. మీరు ఇరవైఏళ్ళ క్రింద కొన్నప్పటికీ నేటికీ అది మీకు బాగా ఉపయోగపడాలనేదే మా ఆశయం. ఇరవైలక్షలమందికి పైగా ఉన్న మీలాంటి ప్రెస్టీజ్ కొనుగోలుదార్లకు సకాలంలో సమర్థవంతమైన సేవలను అందించాలనే ఒక కొత్తపథకం రూపొందించాము. ఈపథకంలో ఒక భాగంగా బెంగుళూరులోగల కంపెనీ ప్రధాన కార్యాలయంలో ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు సెంటర్ ఏర్పడింది.

దేశవ్యాప్తంగా 350 సర్వీసు కేంద్రాలు

ప్రెస్టీజ్ సర్వీసు పథకంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా 350 ఆథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాలు ఏర్పడ్డాయి. అందుచేత మీరు ఎక్కువదూరం వెళ్ళక్కరలేదు. అన్ని ఆథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాలు ఆథరైసెషన్ సర్టిఫికెట్టును కలిగివున్నాయి. ప్రెస్టీజ్ సర్వీసు గుర్తుగల ఆసర్టిఫికెట్టుకోసం చూడండి. తక్కువధరలో మంచి స్పేరుపార్టులకు, కంపెనీలో శిక్షణపొందిన టెక్నీషియన్లచే నమ్మకమైన సర్వీసుకు మీకు హామీ ఇస్తున్నాం. ప్రెస్టీజ్ సర్వీసు రేటుకార్డు చూపించమని అడగండి.

మాకు వ్రాయండి - మీ సేవలకు మేమెల్లప్పుడూ సిద్ధమే

350 ఆథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాల విధులకు అనుబంధంగా 9 ప్రాంతీయ సర్వీసుకేంద్రాల సహాయంతో, ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు సెంటర్ ఒక సమన్వయ సమాచార శాఖగా పనిచేస్తుంది. మీ ప్రెస్టీజ్ నుండి అమితమైన లాభం ఎలాపొందాలో తెలుసుకోవాలన్నా, మీ ప్రాంతములోవున్న ఆథరైజ్‌డ్ సర్వీసు కేంద్రాల జాబితా కావాలన్నా ఈ క్రింది కూపనును పూర్తిచేసి పంపించండి. మీకు ఎలాంటి ఇబ్బందులున్నా, లేక మీరు ఎలాంటి సూచనలు చేయాలనుకున్నా, వ్యక్తిగతమైన సేవలను మీకు సంతోషపూర్వకంగా అందిస్తాం.

కన్స్యూమర్ సర్వీసు మేనేజర్,
ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు సెంటర్,
టి. టి. (ప్రవేటు) లిమిటెడ్,
దూరవాణినగర్, బెంగుళూరు-560 016.



ఉచితం!

"ప్రెస్టీజ్ వల్ల అమిత లాభం పొందండి"
అనే ఉపయోగకరమైన కరపత్రం.
ఈ కూపనును నేడే పోస్టు చేయండి !

పేరు ........................
చిరునామా ........................
........................
క్యాప్ నంబరు ........................
(కూతకోటుకాగా. రాయండి)

కన్స్యూమర్
సర్వీసు మేనేజర్,
ప్రెస్టీజ్ నేషనల్ సర్వీసు
సెంటర్, టి టి. (ప్రవేటు)
లిమిటెడ్, దూరవాణినగర్,
బెంగుళూరు-560 016.

Prestige
NATIONAL SERVICE CENTRE

MCA-TT-54 Tel

"ఇద్దరు వెయిట్ చేస్తున్నారండీ!"

"సరే, పంపించు!" అని అతనితో చెప్పి నా వైపు తిరిగేడు ఆయన.

"రాత్రి ఎనిమిది గంటలకు మీరు మళ్ళీ రండి" అన్నాడు ముక్తసరిగా...

మరేం మాట్లాడకుండా అక్కడి నుంచి బయటికొచ్చేను ...

రాత్రి ఎనిమిది గంటలకు ఎందుకు రమ్మన్నాడో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

ఇంత కాలంగా జాతకాలు చూపించుకోవడమంటే ఎంతగా చిరాకుపడేవాడినో, ఇంతకుముందు పండిట్జీని చూసిన తర్వాత, ఆయన చెప్పిన విషయాలు విన్న తర్వాత జాతకాల మీద అంతా నమ్మకం పెరిగిపోయింది.

ఆయన ఎంత గొప్పవాడు కాకపోతే జరిగింది జరిగినట్టుగా చెప్పగలుగుతాడు?

చిన్నప్పుడు కోటిలింగం అని నాకో స్నేహితుడుండేవాడు. మా వీధి చివరే వాళ్ళిల్లు. వాడికి నాన్న లేడు. వాళ్ళమ్మ మెషీన్ కుట్టి వాణ్ణి చదివించేది. ఇద్దరం స్కూలుకు ప్రతి రోజూ కలిసి వెళ్ళేవాళ్ళం. సాయంత్రం పూట మా వూరి కాలవలో ఈతకొట్టే వాళ్ళం...

ఒకసారి అలా ఈత కొడుతూంటే కోటిలింగానికి ఆయాసం వచ్చింది. ఈత కొట్టలేక నీళ్ళలో కాళ్ళు తేలేసేడు. కానీ వాడికి అక్కడ నేల అందలేదు. ఉక్కిరి బిక్కిరై పోయేడు. ఆ పక్కన నేను లేకపోతే ఆ ప్రవాహంలో వాడు కొట్టుకు పోయేవాడే! ప్రాణానికి తెగించి నే నప్పుడు వాడ్ని బలంగా బయటకులాగేను.

"ఒరేయ్ రావుడూ! ఇవాళ నువ్వు నాకు ప్రాణదానం చేసేవురా!" అంటూ ఆ తర్వాత వాడు నన్ను కౌగలించుకున్నప్పుడు నే నెంతో గర్వపడ్డాను. కృతజ్ఞత నిండిన కళ్ళ వెనకాల కన్నీరు దాచుకుని అప్పుడు వాడు చూసిన చూపు జ్ఞాపకాని కొస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

ఆ సంఘటన జరిగిన పదిహేను రోజులకే విష జ్వరం వచ్చి వాళ్ళమ్మ చచ్చిపోయింది. కోటిలింగం దిక్కులేనివా డయిపోయాడు. ఎలా ఓదార్చాలో తెలియని చిన్నతనం నాది. అయినా ధైర్యం చేసి ఆ రోజున... వాళ్ళమ్మ పోయిన రోజున వాళ్ళింటికి వెళ్ళాను.

నన్ను చూసి కోటిలింగం బావురుమన్నాడు.

"ఆ రోజున నేను కాలువలో మునిగిపోయినా బాగుండేదిరా! ఇవాళ అమ్మ లేకపోతే నే నెలా బతగ్గల్రా రావుడూ?" అంటూ నన్ను కౌగలించుకుని ఏడ్చేడు.

వాడి జీవితంలో అదో మలుపు.

ఆ వూళ్ళో ఉన్న ఇల్లు అమ్మేసి, కాలేజి చదువుకి స్వస్తి చెప్పేసి వాళ్ళ మేనమామతో విశాఖపట్నం వెళ్ళిపోయేడు కోటిలింగం...

అది సుమారు ఇరవై సంవత్సరాల క్రితం నాటి గతం! ఆ గతంలో జరిగిన సంఘటనను పండిట్జీ గుర్తుచేయడంతో ఆయన మీద గురీ, గౌరవం మరింత పెరిగిపోయేయి.

నా చెయ్యి చూసి రాత్రి ఏం చెబుతాడో? రాజయోగం కాకపోయినా, నెలాఖర్లో డబ్బు లేక చిరాకుపడే పరిస్థితి ముందు ముందు తప్పుతుందంటాడో లేదో?

రకరకాల ఆలోచనలతో ఆ పగలంతా గడిపి, రాత్రి ఎనిమిదయ్యే సరికి మళ్ళీ పండిట్జీని కలుసుకున్నాను.

ఇప్పుడు పండిట్జీ కాషాయ వస్త్రాల్లో లేడు తెల్లటి గ్లాస్కో పంచె మీద సిల్కు జుబ్బా వేసుకున్నాడు. మెడలో సన్నని బంగారు గొలుసు! ఒత్తుగా ఉన్న గిరజాల జుట్టూ, పొడవైన గడ్డం—ఆయన అందాన్నిప్పుడు పెంచుతున్నాయి.

"ఇక్కడ ఎంత కాలంనుంచీ ఉంటున్నావ్?" నేను కూర్చున్న తర్వాత అడిగేడు పండిట్జీ.

"అయిదారేళ్ళయుంటుంది."

"పిల్లలెంతమంది?"

"ముగ్గురు."

"అమ్మా, నాన్నా అమలాపురం లోనే ఉంటున్నారా?" క్షణ మాగి మళ్ళీ ప్రశ్నించాడు.

ఆ ధోరణి నాకు వింతగా తోచింది. చెయ్యి చూసి భవిష్యత్తెలా ఉంటుందో చెప్పటం పోయి, అయిన వాళ్ళెవరో కుశలం అడిగినట్టు, ఆ ప్రశ్నలేమిటీ?. . .

అయినా సభ్యత కోసం సమాధానం చెప్పాలి కనక చెప్పాను. . . కానీ మనసులో ఏవేవో అనుమానాలు పీడిస్తూనే ఉన్నాయి. . .

నా ఆలోచనల్లో నే నుండగా ఆయన లేచి టేబిల్ దగ్గరకు వెళ్ళాడు. . . బ్రీఫ్‌కేసు తెరిచి విస్కీ బాటిల్ ఒకటి తీసుకొచ్చాడు. గాజు గ్లాసులూ, మంచినీళ్ళ కూజా తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు.

అంతా అయోమయంగా ఉంది నాకు.

"ఏమి టంత భయంగా చూస్తున్నావ్? ఇది విషం కాదు. విస్కీ" అన్నాడు సీసా మూత తిప్పుతూ.

ఏం మాట్లాడాలో తెలీక కొంచెం ఇబ్బంది పడ్డాను.

"ఏం?. . .అలవాటు లేదా?" చిన్నగా నవ్వుతూ అడిగాడు, నా చూపుల్ని పసిగట్టి.

లేదన్నట్టు తల అడ్డంగా తిప్పాను. . .

"ఒకసారి బి. ఎ. చదివే రోజుల్లోనే కాలేజీ డే నాడు మీ రంతా కలిసి నాటకం వేశారు గుర్తుందా?" సీసాలోని విస్కీని కొంచెం కొంచెం గ్లాసుల్లో పంచుతూ అడిగాడు.

గుర్తుందని నేను అనలేదు. మళ్ళీ తనే అన్నాడు:

"నీకు గుర్తుండే ఉండాలి. కాలేజీ పక్కన సారా దుకాణం ఉంటే, నాటకానికి ముందు నువ్వూ, నీ ఫ్రెండూ చెరో గ్లాసు పుచ్చుకొచ్చారు. నువ్వు పూర్తిగా తాగలేకపోతే దాన్నికూడా నీ ఫ్రెండే తాగేశాడు."

"అవును. . .గుర్తుంది. డ్రామా వేసే వాళ్ళంతా స్టేజి ఎక్కే ముందు తాగుతారని చెప్పి అప్పుడు కోటిలింగమే నా చేత బలవంతంగా తాగించాడు." గుర్తు చేసుకుంటూ చెప్పాను.

నా కళ్ళల్లోని ఆశ్చర్యాన్ని పసి గట్టాడు కాబోలు.

"అలా ఆశ్చర్య పడిపోకు. ఆ కోటిలింగాన్ని నేనే" అన్నాడు.

నా కుర్చీ కింద బాంబు పేలినట్టు ఉలిక్కి పడ్డాను.

"మీరు. . . కోటిలింగం... అంటే..."

వాయిదాలమీద ట్రాన్సిస్టర్లు

ఎగుమతి నాణ్యత గల శక్తివంతమైన ఏ/సి—కవ్: బ్యాటరీ మల్టీ—ఐ, 4 బ్యాండ్ల అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్‌ను ఇప్పుడు నెలసరి రు. 10/-ల సులభ



వాయిదాల మీద పొందండి. వెల రు. 250/—లు, రెండు సంవత్సరముల గ్యారంటీతో ప్రతి పల్లెకు, పట్టణంకు మీ ఇంటికి పంపబడగలదు. ప్రతి సెట్టుతోను లై సెన్సు ఉచితము. నేడే ఆర్డరు పంపండి.

EACHO RADIO & TRANSISTOR CO. (AP)
Post Box No. 9447, Delhi-110051.

ఏ సచిత్ర వారపత్రికా ప్రవేశపెట్టని విధంగా ఆఫ్‌సెట్ ముద్రణతో! మీకు నచ్చే శీర్షికలు/ఇంకొ కథలతో

ఇంటింటికీ ఆనందజ్యోతి

ఆనందజ్యోతి సచిత్ర వారపత్రిక

త్వరలో కొత్త సీరియల్స్

సీరియల్-1 అందగాడు
రచయిత్రి మాదిరెడ్డి సులోచన

సీరియల్-2 మేలుకొలుపు
రచయిత: చివుకుల పురుషోత్తం

ఏజెంట్లు లేని చోట ఏజెంట్లు కావలెను!

ఆనందజ్యోతి
P.B. NO. 387. చెట్ల బజారు, సూర్యారావుపేట, విజయవాడ-2.

ఆనందం పట్టలేక ఏమిటో మాట్లాడబోయాను.

"మోరూ లేదు, గారూ లేదు. నేను ఉత్తి కోటిలింగాన్నే. మర్యాదలు కట్టి పెట్టి మామూలుగా మాట్లాడు" అన్నాడు.

వయసు తెచ్చిన మార్పుల వల్ల వెంటనే పోల్చుకో లేకపోయానే తప్ప కళ్ళల్లోకి సూటిగా చూస్తే కోటిలింగాన్ని గుర్తు పట్టటం అంత కష్టమనిపించ లేదు. . .

విస్కీ గ్లాసు ఒకదాన్ని నా ముందుంచి, మరొకటి తాను తీసుకున్నాడు.

"అలవాటు లేదు. నన్నొదిలెయ్."

"అయితే ఆ తరవాత మళ్ళీ ఎప్పుడూ ఎంగిలి పడలేదన్న మాట."

"చెప్పానుగా. ఆ తరవాత మళ్ళీ నే నెప్పుడూ స్టేజీ ఎక్కలేదు."

"ఆల్ రైట్. ఆ రోజున తాగినట్టే ఇప్పుడుకూడా ఈ ఫ్రెండు కోసం కొంచెం 'సిప్' చేసి వదిలెయ్." తన పట్టు వదల్లేదు కోటిలింగం.

గ్లాసు తీసుకున్నాను. . .

తన గ్లాసును నా గ్లాసుకి తాకించి 'ఛీర్స్' అన్నాడు. చూస్తూండగానే గ్లాసులో దంతా ఒక్క గుక్కలో తాగేసి సిగరెట్ వెలిగించాడు.

"నువ్వు మాత్రం అప్పటినుంచీ దీనికి అలవాటు పడిపోయావన్న మాట." తన గ్లాసులో మరి కొంచెం పోసుకుంటున్న కోటిలింగాన్ని అడిగాను.

"అలవాటు పడ్డం కాదురా. ఆత్మీయు ణ్ణి పోయాను...అమ్మ పోయిన తరవాత ఇదే నాకు కన్నతల్లయిపోయింది. రాత్రిళ్ళు జోకొట్టి ఇదే నన్ను నిద్ర పుచ్చుతుంది." గ్లాసెత్తి చూపిస్తూ చెప్పాడు కోటిలింగం.

"ఆరోగ్యం చెడిపోదూ?"

"చెడిపోతే రిపేరు చెయ్యడానికి డాక్టర్లు చాలా మంది పరుగెత్తు కొస్తారు నా దగ్గిరికి."

"అవును మరి. చాలా పేరు ప్రఖ్యాతులు సంపాదించావ్." అభినందన పూర్వకంగా అన్నాను.

"పేరు ప్రఖ్యాతులు రావటానికి కారణం డబ్బేరా. డబ్బుంటే పేరూ, ప్రఖ్యాతీ వాటంతటవే మనల్ని వెతుక్కుంటూ వస్తాయ్. జాతకం చూడాలంటే మనిషికి పాతిక. కానీ సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి, చూపించుకునే వాళ్ళ హోదానీ బట్టీ రేట్లు మారుతూ ఉంటాయి" తీసుకుంటున్న మందు ప్రభావం ఆతని మాటల వేగంలో కనిపిస్తోంది.

"పొద్దున్న ఒక మంత్రిగారొచ్చారు. జాతకం చెప్పాను. రాబోయే రోజుల్లో కీడు జరగబోయే సూచన లున్నాయని హెచ్చరించాను. . . ఆ మాట వినగానే ఆయన గారి భారీ శరీరం కాస్తా చెమటతో తడిసి పోయింది. . . రక్ష రేఖ ఇస్తాను, భయపడ వద్దని అభయ మిచ్చాను. . . రక్షరేఖ ఖరీ దెంతో తెలుసా?. . . ఐదు వందలు. . ." నా కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు.

"పిన్నే, బాగా సంపాదిస్తున్నావ్. హాయిగా సుఖ పడుతున్నావ్."

నా మాట విన్న కోటిలింగం విరాగిలా నవ్వేశాడు.

"హాయి! సుఖం. హుఁ. రేయ్, రాముడూ! కష్టపడి సంపాదించే డబ్బులో దొరికే తృప్తి, సుఖం అన్యాయంగా ఆర్జించటంలో దొరకదురా" అన్నాడు.

"ఇందులో అన్యాయం ఏముందీ? నీ విద్యని నువ్వు క్యాష్ చేసుకుంటున్నావ్. తప్పేమిటి?" అడిగాను.

వెంటనే ఏమీ మాట్లాడలేదు కోటిలింగం. . . నేను 'సిప్' చేసి వదిలేసిన విస్కీ గ్లాసు అందుకుని, "నాకు ఒకప్పుడు ప్రాణదానం చేసిన వాడివి. నీ ఎంగిలి తాగటం తప్పు కాదు" అంటూ అందులో ఉన్న విస్కీనికూడా తాగేశాడు.

ఆ తరవాత సిగరెట్టు వెలిగిస్తూ అన్నాడు. . .

"నేను క్యాష్ చేసుకుంటున్నది నా విద్యని కాదురా. ప్రజల అమాయకత్వాన్ని. వాళ్ళ వేలం వెర్రిని."

"అంటే. . .?"

"నిజం చెప్పాలంటే నాకీ ఫీల్డులో ఓనమాలు కానీ, ఏ బీ సీ డీ లు కానీ రావు. . . అయినా జాతకాలు చెబుతున్నాను.ఎలా చెబుతున్నా నంటావ్?" సిగరెట్ పొగ వదులుతూ అడిగాడు. . .

"ఎలా చెబుతున్నావ్ మరి?" అడిగాను.

కోటిలింగం ముఖ కవళికలు గంభీరంగా మారి పోయాయి. . . చెప్పటం ప్రారంభించాడు.

"అమ్మ పోయిన తరవాత మామయ్యతో విశాఖ పట్నం వెళ్ళిపోయాను. అక్కడ బి. ఎ. పాసయ్యాను. ఆ తరవాత ఉద్యోగం కోసం చెప్పు లరిగేలా తిరిగాను. కనపడిన ఖాళీ పోస్టు కల్లా అప్లై చేశాను. అయినా ఫలితం కనిపించలేదు. ఇంట్లో నా మీద మామయ్య విసుక్కోవటం ఎక్కువయింది. సరిగ్గా ఆ రోజుల్లోనే ఒకసారి బీచ్ దగ్గిర ఒక వ్యక్తిని చూశాను. అతనికి సుమారు ఉంటే పాతికేళ్ళుంటాయి. కొంచెం ఖరీదయిన దుస్తుల్లో ట్రిమ్‌గా ఉన్నాడు. రిమ్‌లెస్ కళ్ళద్దాలు కుడి చేతి వేళ్ళకు రెండో, మూడో ఉంగరాలు. గోమాతను ఆనుకుని శ్రీ కృష్ణపరమాత్మ నిలబడి నట్టు, సైకిల్‌ను ఆనుకుని నిలబడ్డా డతను. . అరచేతిలో రేఖలు చూసి భవిష్యత్తు చెబుతున్నాడు. చేతికి రెండు రూపాయలు. జనం విరగబడి చూపించు కుంటున్నారు. . ."

చెప్పటం ఆపి, సిగరెట్‌ను యాష్‌ట్రేలో పడేసి కూజాలోని మంచినీళ్ళు గ్లాసులో పోసుకుని తాగాడు.

"ఆ తరవాతేమయింది?" అడిగాను ఆత్రతగా.

"నాని ఉద్యోగం కోసం కాళ్ళకు బలపాలు కట్టుకుని తిరిగేకంటే 'జ్యోతిషం చెప్పబడు'నని బోర్డు కట్టు కుంటే బెటరనుకున్నాను. కానీ జనానికి కావలసింది వెరైటీ. అందుకే నా వ్యాపారంలో కొత్త వెరైటీ చూపి స్తున్నాను. మనం ఎంత ఖరీదయిన చోటికి మకాం చేస్తే మన దగ్గరకు అంత ఖరీదయిన మనుషులు వస్తారు. వచ్చే వాళ్ళ ధోరణినీ, మనోభావాల్నీ పసి గట్టి సందర్భానుసారంగా మనకి తోచింది చెబితే చాలు, మన రేటు మన కొచ్చేస్తుంది." భుజాలు ఎగరేస్తూ చెప్పాడు.

"అంటే. . . ఈ శాస్త్రంలో ఏమాత్రం.

ఉచితం! ఉచితం!!

తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఏరుపు రంగును మా ప్రఖ్యాత మందివలన ఐదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారమునకు విచిత్రము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు:

BHARAT AYURVEDASHRAM,
P.O. Katri Sarai (Gaya)




మా స్వంత బ్రాంచీలు
1. తిరుపతి. 2. అనంతపూర్. 3. నెల్లూరు. 4. విజయవాడ. 5. విజయవాడ-2. 6. మచిలీపట్నం. 7. ఒంగోలు. 8. బెంగుళూరు. 9. మద్రాసు, 10. బెంగుళూరు-4, 11. నెల్లూరు. 12. సి.సోటా.

మీకు బేబీ/బాబు కావాలా!



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీ సోదరులు అనేకులు మా సలహాలచే సంతాన వంతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు. ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తెనాలి-2.

అనుభవం నీకు లేదన్న మాట."

"లేదు. . . కానీ మనుషుల మనోభావాలు చదవటంలో అనుభవం సంపాదించాను. . ."

"అయితే పేపర్లో నెహ్రూగారు నీ చేత జాతకం చెప్పించుకున్నారని ప్రకటన చేయించావ్... అది నిజమేనా?"

నా ప్రశ్న విని చిన్నగా నవ్వేడు కోటిలింగం...

"అబద్ధం అని చెప్పటానికి నెహ్రూగారు ఇప్పుడు లేరుగా! ..."

"..............." తెల్లబోయేను.

"అదే వెరైటీ. తెలివి తేటలు. ఒక సారి నేను ఏదో ఇంటర్వ్యూకి ఢిల్లీ వెళ్ళాను. ఎలాగా ఢిల్లీ వెళ్ళాను కదా అని నెహ్రూగార్ని చూడాలను కున్నాను. . . నాలుగు రోజులు ప్రయత్నిస్తే ఎలాగో చివరికి నాకు ఛాన్సు దొరికింది. ఆయన దగ్గర మూడు నిమిషా లున్నాను. . .ఆ మూడు నిమిషా ల్లోనూ నన్ను గురించి నేను పరిచయం చేసుకుని, దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందనీ, ప్రభుత్వం ఆవిషయంలో చర్య తీసుకుంటే తప్ప నా లాంటి వారికి విముక్తి ఉండదనీ ఆయనతో అన్నాను. . . 'మనిషి చేతిలోనే స్వర్గం ఉందనీ, కష్టపడి పనిచేస్తే సాధించలేనిది ఏదీ లే'దనీ ఆయన చెప్పారు. . . అప్పుడు అక్కడ ఉండే ఫోటోగ్రాఫరు ఫోటో తీశాడు. నెహ్రూ గారంతటి మహా వ్యక్తితో మాట్లాడిన సాక్ష్యంగా ఫోటో ఉంటే బాగుంటుందని ఆ ఫోటోగ్రాఫర్ని బతిమాలి తరవాత ఒక కాపీ సంపాదించుకున్నాను. . . ఈ సంఘటనజరిగిన ఏడాదికి నెహ్రూగారుపోయారు."

"అయితే ఆయన పోయిన తరవాత అఫోటోను ఇలా నీ వ్యాపారానికి ఉపయోగించుకుంటున్నా వన్న మాట."

అవునన్నట్టు తలూపాడు కోటిలింగం.

"చాలా అన్యాయం."

"నిజమే. అన్యాయమే. అస లీ కలియుగంలో న్యాయం, ధర్మం ఎక్కడున్నాయ్‌రా? అయినా ఏ బిజినెస్ చేసినా ఇలాంటి తెలివి తేట లుండాలి. ప్రజల బలహీనత మీద దెబ్బ కొట్టడం చేతనయితే ఏ బిజినెస్ అయినా రాణిస్తుంది."

"కానీ దగా, మోసం ఎన్నాళ్ళో సాగవ్. ఏదో ఒక రోజున బయట పడతాయ్... అప్పుడు నీకు కనీసం ఇంత మనశ్శాంతికూడా దొరకదు."

నా మాటలు విన్న కోటిలింగం నిట్టూర్చాడు.

"మనశ్శాంతి! ఇప్పుడు మాత్రం అది నాకు దొరుకుతూం దనుకుంటున్నావ్‌రా? నో! నా సంపాదన ఎక్కువవుతున్నకొద్దీ మనసులో ఆరాటంఆలోచనలూ పెరిగి పోతున్నాయి. మోసంతో అమాయకుల్ని వంచించి పాపం మూట కట్టుకుంటున్నా ననేభయం నా నిద్రని దూరం చేస్తూంది. అందుకే రోజూ ఈ మందు వాడాల్సి వస్తూంది" అన్నాడు టీపాయ్ మీదనున్న విస్కీ బాటిల్‌ను చూపిస్తూ.

నే నేం మాట్లాడలేదు. రెండు క్షణాల నిశ్శబ్దం తరవాత కోటిలింగం మళ్ళీ అన్నాడు.

"నా దగ్గిర పనిచేస్తున్న కుర్రాణ్ణి పొద్దున్న నువ్వు చూసే ఉంటావ్. అతని పేరు శాస్త్రి. బి.ఎ. పాసయ్యాడు. ఉద్యోగంలేదు. చాలా కష్టాల్లో ఉన్నాడు. అందుకే నా దగ్గిర పెట్టుకున్నాను. రోజుకి పాతిక రూపాయల జీతం."

"అంటే నెలకి ఏడు వందల యాభై. బాగానే ఉంది."

"ఎప్పుడూ ఇతనే ఉండడు. ఒకో పూట్కొక్కొక్క రిని పెట్టుకుంటుంటాను. ఆ పూళ్ళో పని ఎన్ని రోజు లుంటే వాళ్ళకు అన్ని పాతిక లన్న మాట. చదువుఉన్నా ఉద్యోగం లేక అవస్థలు పడే వాళ్ళనే వేసుకుంటుంటాను." చెప్పాడు కోటిలింగం.

"ఉద్యోగం లేని వాళ్ళంతా ఇబ్బందులు పడు తున్నారనీ, ఉద్యోగం చేసుకునే వాళ్ళంతా సుఖ పడు తున్నారనీ గారంటీ ఎక్కడుందీ?" పాతికేళ్ళుగా ఉద్యోగం వెలగ బెడుతున్న నన్ను నేను అంచనా వేసుకుని అలా అడిగాను.

"అదీ పాయింటే. అందుకే స్వయంగా నేనే వాళ్ళింటికి వెళ్ళి పరిస్థితులు తెలుసుకుంటాను. ఇంటర్వ్యూకి వాళ్ళు నా దగ్గిరికి రారు. నేనే వాళ్ళింటికి వెడతా నన్న మాట. అలా [illegible] ఉండే ఒక వ్యక్తికి సాయ పడడం వల్ల నాకు [illegible] మయినా మనశ్శాంతి దొరుకుతూంది." అలా చెబు తున్న కోటిలింగం కళ్ళల్లో కన్నీరు మెరవటం గమనిం చాను. . .

అతను చెప్పినదంతా విన్న తరవాత ఇంక అక్కడ కూర్చోవలసిన అవసరం నాకు కనిపించ లేదు. . .

"సారీ రా రాముడూ. ఏం అనుకోకు" అంటూ నా చేతులు పట్టుకున్నాడు నేను లేస్తూంటే. . .

"ఒకనాడు నువ్వు నాకు ప్రాణదానం చేశావ్. ఇవాళ నిన్నందుకే మోసం చేయలేక పోయాను. . . నిజాన్ని నీ దగ్గిర దాచలేక పోయానుకూడా. జాతకాల మీద నమ్మకం నీకు లేదని నాకు తెలుసు. ఎవేక సిన్ని నువ్వు నా దగ్గిర అన్నావుకూడా. అయినా ఇవాళ అందుకోసం బయలుదేరావంటే నువ్వెన్ని చికాకుల్లో ఉన్నావో వూహించుకో గలను. . . జ్యోతిషశాస్త్రంలో నాకు అనుభవం లేకపోయినా దాన్ని తరిచి చదివిన పండితులు ఎందరో ఉన్నారు. వాళ్ళ దగ్గిరి కెళ్ళి తప్పకుండా నువ్వు నీ జాతకం చూపించుకో. . . ఆర్థికంగా నీకు ఎలాంటి సహాయం కావలిసి నా. ఈ కోటి లింగాన్ని మరిచిపోకు." అన్నాడు దీనంగా చూస్తూ. . .

★


మిసెస్. బ్యూటీ పేర్లర్, హైదరాబాదుకు చెందిన
శ్రీమతి హరక్ అజ్మాన్ యిలా అంటున్నారు.

"గ్లీమ్ షాంపూతో యిక ఏ రకమైన జుట్టును గురించైనా నేను అవస్థ పడనక్కర్లేదు! మీ తరహా జుట్టు కోసమే ప్రత్యేకంగా రూపొందించ బడిన రకం ఒకటి ఉంది!"

ప్రతి గ్లీమ్ షాంపూ దానిలోని ప్రత్యేక పదార్థాల మూలంగానూ, పుష్కలమైన నురగమూలంగానూ పూర్తి ఫలితాలను ఇస్తుంది. మీ జుత్తు ఏ రకానికి చెందినది అయినా, గ్లీమ్ మూలంగా దానికో కొత్త అందం సమకూరుతుంది. దాని ప్రత్యేకమైన సుగంధం మిమ్మల్ని అంటి పెట్టుకునే వుంటుంది—ఎంతో పొదుపు కూడా.

| గ్లీమ్ రెగ్యులర్ | గ్లీమ్ ఎగ్ | గ్లీమ్ టానిక్ |
| --- | --- | --- |






ఇప్పుడు
వీలైన 60 మి.లీ.
సైజులో కూడా

గ్లీమ్ షాంపూ
ప్రఖ్యాత హెయిర్ డ్రెస్సర్ల
మెప్పు పొందినది.

Geoffrey Manners & Co. Ltd.